కార్యకర్తలు అద్భుతంగా పనిచేశారు

టెలికాన్ఫరెన్స్‌లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 29 : ''బీఆర్ఎస్ రజతోత్సవ సంబురాల సందర్భం గా కార్యకర్తలు చాలా అద్భుతంగా పని చేశారు, స్వచ్ఛందంగా తరలివచ్చి కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్ పై ఉన్న ప్రేమను చాటి చెప్పడం సంతోషంగా ఉందని'' ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ నియోజకవర్గంలోని బీఆర్ఎస్‌నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో జెండాగద్దెలు ఏర్పాటు చేయడం, గోడలకు వాల్‌రైటింగ్స్ చేయించడం, పోస్టర్లు అతికించడంలో కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేశారన్నారు. ప్రత్యేకమైన వాల్‌పోస్టర్, ఫ్లెక్సీలు, బ్యానర్లు చేయించుకోవడం, సోషల్ మీడియా ద్వారా రజతోత్సవం గురించి విస్తృతంగా ప్రచారం చేశారన్నారు. అవాంఛనీయ ఘటన జరగకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి కేసీఆర్ పట్ల ఉన్న ప్రేమను చాటిచెప్పారన్నారు. గులాబీ అధినేత కేసీఆర్ తిరుగు ప్రయాణంలో జనగామ నియోజకవర్గంలో అడుగుపెట్టినప్పటి నుంచి ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం వరకు దారిపొడవునా నాయకులు, కార్యకర్తలు చూపించిన ప్రేమ, ఆప్యాయతలు మరువలేనివని కేసీఆర్ ప్రత్యేక అభినందనలు తెలిపారని వివరించారు.

రేణుకాఎల్లమ్మ జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు

జాతర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హుస్నాబాద్ ఆర్డీవో రామమూర్తి

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 29: హుస్నాబాద్‌లో మే 12వతేదీ నుంచి ప్రారంభంకానున్న రేణుకా ఎల్లమ్మజాతర కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తామని హుస్నాబాద్ ఆర్డీవో రామమూర్తి తెలిపారు. రేణుకా ఎల్లమ్మ ఆలయ ఆవరణలో మంగళవారం జాతర ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో జరగనున్న జాతరకు భక్తులు వేలాదిగా తరలివస్తారని, మున్సిపల్ ఆధ్వర్యంలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ సూచనల మేరకు జాతర ప్రారంభమయ్యేలోపు పోచమ్మ ఆలయ పునర్నిర్మాణం పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆలయ అధికారులకు ఆయన సూచించారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోరేణుకా ఎల్లమ్మజాతర పోస్టర్‌ను బీసీసంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లాగ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండోచైర్మన్ బొలిశెట్టి శివయ్య, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, కమిషనర్ టి. మల్లికార్జున్‌గౌడ్, ఎస్సై తోట మహేశ్, ఆలయ ఈవో కిషన్‌రావు, ఆలయ మాజీచైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ, చిత్తారి రవీందర్, సుంకె రాజశేఖర్, ఆలయ అర్చకులు పరమేశ్వర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న రుద్రశత చండీయాగం

భక్తులకు అనుగ్రహభాషణం చేస్తున్న మాధవానంద సరస్వతీస్వామి

చేర్యాల, ఏప్రిల్ 29 : మండలంలోని ఆకునూరు భవానీ రుద్రేశ్వరాలయం(శివాలయం)లో రుద్రసహిత శతచండీయాగం భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నది. నాలుగు రోజులుగా కొనసాగుతున్న వైదిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలతో ఆకునూరు భక్తితన్మయత్నంలో మునిగిపోయింది. భైరవభట్ల చక్రధారి, సీతారామశర్మ, హరికృష్ణ ఆధ్వర్యంలో వేద పండితులు రాధాకృష్ణశర్మ, మృత్యుంజయశర్మ పర్యవేక్షణలో చండీయాగం కొనసాగుతున్నది. నాలుగో రోజు స్థాపితదేవతా పూజలు,మూలమంత్ర అనుల స్థానములు, శతచండీపారాయణములు, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, పంచసూక్త హోమాలు, చండీహోమం పూజలు నిర్వహించారు. శ్రీమాతా శతరుద్రీయ సేవా పరిషత్ వారిచే సామూహిక కుంకుమార్చన, మాధవానంద సరస్వతీ స్వామివారికి స్వాగతం, పాదపూజ, అనుగ్రహభాషణము నిర్వహించారు.మహిలింగార్చన సేవా పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో మహిలింగార్చన, భగవన్నామ సంకీర్తన కార్యక్రమాలు జరిగాయి. రుద్ర సహిత శతచండీ యాగాన్ని భైరవభట్ల సరస్వతీసీతారామశర్మ, నాగిళ్ల వనజాశ్రీరామశర్మ, అనఘ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గ్రామంతో పాటు చేర్యాల పట్టణం పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనల వెల్లువ

ల్యాప్‌టాప్‌లు అందుకున్న విద్యార్థులను అభినందిస్తున్న అధికారులు, టీచర్లు

చేర్యాల, ఏప్రిల్ 29 : మండలంలోని ఆకునూరు ఉన్నత పాఠశాలకు చెందిన ఏడో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు సాత్విక, సంజన కాగ్నిజెంట్ సాఫ్ట్‌వేర్ సంస్థ 'ధ్యేయ' ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబర్చి ల్యాప్‌టాప్‌లు అందుకున్నారు.ఈ సందర్భంగా హెచ్ఎం ఐలయ్య మాట్లాడుతూ ధ్యేయ సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా పరీక్ష నిర్వహించి ఐఐటీ, జేఈఈ మొదలగు ప్రవేశ పరీక్షలకు ప్రతిభ చూపించిన విద్యార్థులను ఎంపిక చేసుకుని రోజూ సాయంత్రం 5 నుంచి 8గంటలకు ఆన్‌లైన్‌లో క్లాసులు, నెలకు రెండుసార్లు గచ్చిబౌలి కాగ్నిజెంట్ కార్యాలయంలో ప్రత్యక్ష తరగతులు నిర్వహిస్తుందన్నారు. పాఠశాల విద్యార్థులు విద్యా సంవత్సరానికి ఎంపిక కావడంపై హెచ్ ఎంతో పాటు జిల్లా సెక్టోరియల్ అధికారి భేతి భాస్కర్, ఎంఈవో ఆర్.కిష్టయ్య, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

వేణుకుమార్ సస్పెన్షన్ ఎత్తివేయాలి

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 29: మండలంలోని మీర్జాపూర్ హెచ్ఎం వేణుకుమార్ సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బానోతు కిషన్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం హుస్నాబాద్‌లో ఆ సంఘం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘటన ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులపై దాడిగా పేర్కొన్నారు. ఉపాధ్యాయ సంఘాలకు అతీతంగా ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులందరూ వేణుకుమార్ సస్పెన్షన్‌ను వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. రిటైర్డు అయినా ప్రధానోపాధ్యాయుడు ఓ సంఘానికి బాధ్యతలు వహిస్తూ ఇలా పాఠశాలలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులను టార్గెట్ చేసుకొని వారి యూనియన్ ద్వారా ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఈ ఘటనపై చట్టపరంగా ఎదుర్కొనేందుకు ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులందరూ కలిసి రావాలని ఆయన కోరారు. సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, వెంకటేశ్, వెంకటయ్య, సమ్మయ్య, శంకర్‌నాయక్, మోహన్, తిరుపతి, రాజు, కాళిదాసు, శ్రీనివాస్, మోహన్, రాజయ్య, కుమార్ పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వలభవిష్యత్

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 29: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని బీసీ సంక్షేమం, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. హుస్నాబాద్ పట్టణానికి చెందిన రాధారపు వైష్ణవి ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీలో 470 మార్కులకు 468మార్కులు సాధించిన విషయం తెలిసింది. ఇంటర్‌లో టాపర్‌గా నిలిచిన వైష్ణవి ఇంటికి మంగళవారం ఉదయం మంత్రి వెళ్లి విద్యార్థిని వైష్ణవితోపాటు వారి తల్లిదండ్రులను సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ వైష్ణవి ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందనడంలో సందేహంలేదన్నారు. గురుకులాల్లో ప్రతిభ కనబర్చిన150 మంది విద్యార్థులను సన్మానించడం జరిగిందని చెప్పారు. వైష్ణవికి ఎలాంటి అవసరం ఉన్నా సహాయం అందించడానికి సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. జిల్లాగ్రంథాలయ సంస్థచైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, నాయకులు చిత్తారి రవీందర్, మ్యాదర బోయిన శ్రీనివాస్, కాశబోయిన సాంబరాజు, నమిలికొండ అయిలయ్య పాల్గొన్నారు.

వరద కాల్వ నిర్మాణం ఆపాలి

నిరసన తెలుపుతున్న రైతులు

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 29: మండలంలోని కూచనపల్లి గ్రామం నుంచి చేపట్టనున్న వరద కాల్వ నిర్మాణం ఆపాలని కూచనపల్లి, పందిల్ల గ్రామస్తులు హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తికి వినతిపత్రం అందజేశారు. మంగళవారం కిషన్‌నగర్‌లోని ఐవోసీ కార్యాలయం ఎదుట రైతులు నిరసన తెలిపిన అనంతరం ఆర్డీవోని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రామంలోని ఇండ్ల మధ్య నుంచి వరద కాల్వ వెళ్తుందని, దీని వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఇది వరకే గ్రామ శివారులో కుంటలు, గొలుసు కట్టు కాల్వలు ఉన్నాయని వాటిని పునరుద్ధరించాలన్నారు. బీఆర్ఎస్ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, రైతులు అయిలేని రవీందర్‌రెడ్డి, నమిలికొండ రవీందర్, కూన రమేశ్, కుమారస్వామి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల జాబితాపై ఆగ్రహం

లింగాపూర్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

పంచాయతీ అధికారులతో లింగాపూర్ గ్రామస్తుల వాగ్వాదం

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 29 : ధూళిమిట్ట మండలం లింగాపూర్‌లో అర్హులైన వారికి కాకుండా అనర్హులకు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేర్లు రావడంపై గ్రామస్తులు అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు, ఎంపీవో వెంకటేశ్వర్లను గ్రామస్తులు నిలదీశారు.ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ప్రకటించిందని, అందుకు భిన్నంగా అనర్హులకు కేటాయించడం ఏమిటన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు అర్హులకు కాకుండా అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి గ్రామంలో పారదర్శకంగా సర్వే నిర్వహించి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.ఈ విషయమై ఎంపీవో వెంకటేశ్వర్లను వివరణ కోరగా అధికారుల నుంచి వచ్చిన ఇండ్ల జాబితా ప్రకారం సర్వే నిర్వహిస్తున్నామని, కేటాయింపులో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.



కొమురవెల్లిలో మాట్లాడుతున్న శెట్టిపల్లి సత్తిరెడ్డి

గ్రామసభల ద్వారానే లబ్ధిదారులను ఎంపిక చేయాలి

కొమురవెల్లి, ఏప్రిల్ 29 : గ్రామసభల ద్వారానే ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో వేసిన ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హులకు న్యాయం జరగడంలేదన్నారు. ఇందిరమ్మ కమిటీ సభ్యులు వారికి ఇష్టం వచ్చిన వారిని ఎంపిక చేస్తున్నారని, తద్వారా అవినీతికి ఆస్కారం ఉందన్నారు. గతంలో మాదిరిగానే గ్రామసభల్లోనే అర్హులను గుర్తించి వాళ్లకు ఇండ్లు మంజూరు చేయాలని, లేని పక్షంలో పేదల పక్షన సీపీఎం పోరాటం చేస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు బి.కృష్ణారెడ్డి, అత్తిని శారద, ఉల్లంపల్లి సాయిలు, తాడూరు మల్లేశం, బక్కెల్లి బాలకిషన్, కర్రోళ్ల ఎల్లయ్య, ఆరుట్ల దయానంద్ పాల్గొన్నారు.

భూభారతితో భూసమస్యలకు చెక్

కలెక్టర్ మనుచౌదరి

ములుగు: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

ములుగు, ఏప్రిల్ 29 : భూభారతి చట్టంతో భూసమస్యలకు చెక్ పెట్టవచ్చని కలెక్టర్ మనుచౌదరి పేర్కొన్నారు. ములుగులో మంగళవారం నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా భూ భారతి చట్టంలోని వివిధ అంశాలను రైతులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ... రెవెన్యూ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను ప్రభుత్వం నియమించనుందన్నారు. పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాలకు పరిష్కారం లభించనుందన్నారు. మనిషికి ఆధార్ కార్డులాగా భూమికి భూధార్ కార్డు కేటాయించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. గ్రామాల్లోని రైతులకు భూసమస్యలపై ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్ ఆరీఫా, ఏఎంసీ చైర్‌పర్సన్ విజయ, ఏఎంసీ వైస్ చైర్మన్ కొడిత్యాల ప్రభాకర్, రైతులు, పాల్గొన్నారు.

కొమురవెల్లిలో...

కొమురవెల్లి, ఏప్రిల్ 29 : భూ భారతితో భూ ఆక్రమణకు చెక్ పెట్టవచ్చని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పద్మశ్రీ గార్డెన్‌లో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌తో కలిసి ముఖ్య అతిథిగా కలెక్టర్ మనుచౌదరి హాజరై మాట్లాడారు. సాదాబైనామలో తెల్లకాగితం మీద జరిగిన భూ విక్రయాల గురించి భూ భారతి కొత్త చట్టం తీసుకువచ్చారన్నారు. గ్రామాల్లో ఉన్న ప్రజలకు భూ భారతి చట్టంపై ఉన్న సందేహాలను నివృత్తి చేస్తామన్నారు. భూ విషయాల పరిష్కారం ఆర్డీవో, అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో జరుగుతాయన్నారు. భూ సమస్యలపై అధికారులు అందించే ఆర్డర్లపై భూ భారతి చట్టంలో అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆర్డీవో సదానందం, తహసీల్దార్ దివ్య, ఎంపీడీవో శ్రీనివాసవర్మ, పీఏసీఎస్ చైర్మన్ మెరుగు కృష్ణాగౌడ్, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మర్కూక్‌లో...

మర్కూక్, ఏప్రిల్29: భూ భారతితో భూ సమస్యలు పరిష్కారమవుతాయని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతిచట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ముందుగా భూభారతి చట్టంలోని వివిధ అంశాలను అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చన్నారు. భూ సమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై భూ భారతి చట్టం ప్రకారం అప్పీలు చేసుకునే అవకాశం ఉందని, రెవెన్యూ డివిజన్ అధికారి నిర్ణయంపై కలెక్టర్, భూ ట్రిబ్యునల్స్ వద్ద అప్పీలు చేసుకోవచ్చన్నారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి, ఆర్డీవో చంద్రకళ, మల్లేశ్‌గౌడ్,తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి,ఎంపీడీవో అశోక్‌కుమార్, అధికారులు,నాయకులు,రైతులు పాల్గొన్నారు.

ఉదారత చాటుకున్న విద్యార్థిని సింధు

ఎల్లదాసునగర్‌లో శంకర్‌కు నిత్యావసర సరుకులు అందజేసిన విద్యార్థిని సింధు

చేర్యాల, ఏప్రిల్ 29 : మండలంలోని శబాష్‌గూడెం గ్రామానికి చెందిన భీమనపల్లి భిక్షపతి రెండో కుమార్తె సింధు తన పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం చేర్యాలలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన ముప్వకిరణ్,ఎల్లదాసునగర్‌కు చెందిన ఉర్ర శంకర్ అనే మానసిక దివ్యాంగులకు ఒక్కొక్కరికి రూ.2500 విలువైన నిత్యావసర సరుకులను ఉపాధ్యాయుడు, సంఘ సేవకుడు అందె విజయ్‌కుమార్ చేతులమీదుగా అందజేసింది. ఈ సందర్భంగా సింధు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు విజయ్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకుని పుట్టిన రోజు కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు.కార్యక్రమంలో మనోచేతన దివ్యాంగుల సంస్థ నిర్వాహకురాలు కాశేట్టి రమాదేవిభాగయ్య, విద్యార్థి తండ్రి భిక్షపతి, తేరాల శ్రీధర్ పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే ఉత్తమ ఫలితాలు

ఆకునూరులో బడిబాట నిర్వహిస్తున్న విద్యాధికారులు, ఉపాధ్యాయులు

చేర్యాల, ఏప్రిల్ 29 : సర్కారు బడిలో అభ్యసించిన వారే నేడు ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారని, తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని జిల్లా సెక్టోరియల్ అధికారి భాస్కర్, ఎంఈవో రచ్చ కిష్టయ్య సూచించారు.మంగళవారం మండలంలోని ఆకునూరు, కాశేగుడిసెల గ్రామాల్లో జిల్లా సెక్టోరియల్ అధికారి, ఎంఈవో, ఉపాధ్యాయులతో కలిసి ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సెక్టోరియల్ అధికారి, ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని అర్హతలు ఉన్న ఉపాధ్యాయులు ఉంటారని, వారి పర్యవేక్షణ,బోధనతో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. ఉచితంగా యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు, కంప్యూటర్ బోధన, సాంకేతికపరంగా విద్యాబోధన అందించడం జరుగుతుందని, తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రైవేట్ స్కూళ్లకు పంపించకుండా సర్కారు బడికి పంపించాలన్నారు.కార్యక్రమంలో ఆకునూరు కాంప్లెక్స్ హెచ్ఎం ఎం.ఐలయ్య, పీఎస్‌హెచ్ఎంలు ఎం.అయోధ్య,ఆంజనేయులు, పి.శ్రీనివాస్,ఉపాధ్యాయులు ఉప్పల ప్రభాకర్, కృష్ణమూర్తి, రవీందర్, సంతోషిరెడ్డి, ప్రేమ్‌కుమార్, శ్యామ్‌సుందర్, రాజయ్య, సమ్మ, శ్రావణ్‌కుమార్, నరేశ్, రాధాబాయి, సీఆర్పీలు కనకరాజు, రజిని పాల్గొన్నారు.

ఈదురు గాలులతో వర్షం

ప్రజ్ఞాపూర్–జగదేవ్‌పూర్ మార్గంలో అక్కారం వద్ద రోడ్డుపై విరిగిపడిన చెట్టు

తొగుట మండలం చందాపూర్ ఐకేపీలో తడిసిన ధాన్యం

గజ్వేల్, ఏప్రిల్ 29: ఈదురు గాలులతో కురిసిన వర్షానికి చెతికొచ్చిన వరి పంటలు దెబ్బతిన్నాయి. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. గజ్వేల్ మండల పరిధిలోని అక్కారం, శ్రీగిరిపల్లి, కోనాపూర్, దాతర్‌పల్లి గ్రామాల్లో కురిసిన వర్షానికి రైతుల పంటలు దెబ్బతిన్నాయి. ప్రజ్ఞాపూర్–జగదేవ్‌పూర్ మార్గంలో అక్కారం సమీపంలో ఈదురు గాలులకు చెట్టు రోడ్డుపై విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాతర్‌పల్లి– అక్కారం గ్రామాల మధ్య రోడ్డుపై చెట్టు విరిగిపడింది. స్థానికులు జేసీబీ సాయంతో చెట్లను రోడ్డుపై నుంచి తొలగించారు. గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది.

చందాపూర్‌లో

తొగుట,ఏప్రిల్ 29: మండలంలోని చందాపూర్‌లో కురిసిన వర్షానికి ఐకేపీ సెంటర్‌లో మొత్తం ధాన్యం తడిసిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ధాన్యంపై కప్పటానికి టార్పాలిన్లు కూడా లేవని మండిపడ్డారు. ప్రభుత్వం వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి దుర్గయ్య ఎంపిక

చిన్నకోడూర్, ఏప్రిల్ 29: సిద్దిపేట జిల్లా అనంతసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న భైతి దుర్గయ్యను ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపిక చేశామని సంస్థ అధ్యక్షుడు మధుకర్ వైద్యుల తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతి కోసం రెండు దశాబ్దాలుగా నిరంతరం విశేష కృషి చేస్తున్న దుర్గయ్యకు మే చివరి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే వసుంధర విజ్ఞాన వికాస మండలి గోదావరిఖని సంస్థ తమ 32వ వార్షికోత్సవ సందర్భంగా పురస్కారం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా దుర్గయ్యను జిల్లాలోని ఉపాధ్యాయులు, సాహితి మిత్రులు అభినందించారు.

కేసీఆర్ ప్రసంగం అమోఘం

సిద్దిపేట,ఏప్రిల్ 29: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ నిర్వహించిన రజతోత్సవ సభలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన ప్రసంగం అమోఘమని ఆ పార్టీ నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి,పోచబోయిన శ్రీహరియాదవ్, ఎడ్ల సోమిరెడ్డి, లక్కరసు ప్రభాకర్‌వర్మ, భూమయ్యగారి కిషన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎల్కతుర్తి సభకు లక్షలాదిగా తరలివచ్చిన జనానికి, అన్ని విధాల సహకరించిన నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. 25 ఏండ్ల పార్టీ ప్రస్తానాన్ని కొనసాగిస్తూనే ఉగ్రవాదుల దాడులను వ్యతిరేకిస్తూ దేశ అంతర్గత భద్రత గురించి కేసీఆర్ చెప్పడాన్ని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. సభ విజయవంతం కావడం కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా వచ్చిన ప్రజాస్పందనకు నిదర్శనంగా చూడవచ్చన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను బీఆర్ఎస్ నిలబెట్టగలుగుతుందని, ప్రజల్లో మరోసారి విశ్వాసాన్ని పెంచిందన్నారు. 420 మోసపూరితహామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ సర్కారు ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదేశాలతో వేలాది మంది విద్యార్థి, యువత ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా పాదయాత్ర ద్వారా సభకు వచ్చి విజయవంతం చేసిన బృందానికి అభినందనలు తెలిపారు. సమావేశంలో నాయకుడు ఇరుగంటి రమేశ్ పాల్గొన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట డివిజన్ పరిధిలో 40 ఫోన్లు రికవరీ

హుస్నాబాద్‌టౌన్: సెల్‌ఫోన్లు అందుకున్న వ్యక్తులతో హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, ఎస్సై మహేశ్

సిద్దిపేటటౌన్: బాధితులకు ఫోన్లను అప్పగిస్తున్న ఏసీపీ మధు

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 29 : సిద్దిపేట డివిజన్ పరిధిలో పడిపోయిన, దొంగిలించబడిన 40 ఫోన్లను పోలీసులు నూతన టెక్నాలజీ ఉపయోగించి రికవరీ చేశారు.ఈ మేరకు మంగళవారం ఏసీపీ మధు బాధితులకు ఫోన్లు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సెల్‌ఫోన్ ఎక్కడైనా పడిపోయినా, దొంగిలించబడినా వెంటనే సీఈఐఆర్‌లో డాటా నమోదు చేస్తే ఫోన్ రికవరీ చేస్తామన్నారు. వన్‌టౌన్ సీఐ వాసుదేవ రావు ,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్, ఏప్రిల్ 29: సెల్‌ఫోన ఎక్కడైనా పడిపోయినా, ఎవరైనా దొంగిలించినా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో తమ డాటాను నమోదు చేయాలని ఏసీపీ పురుషోత్తంరెడ్డి సూచించారు. మంగళవారం గజ్వేల్ డివిజన్ పరిధిలో కొన్ని రోజుల నుంచి పడిపోయిన, దొంగిలించబడిన 45 సెల్‌ఫోన్లను రికవరీ చేసి సంబంధిత బాధితులకు అప్పగించారు. కార్యక్రమంలో సీఐలు సైదా, ముత్యంరాజు, మహేందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 29: సెల్‌ఫోన్ పోగొట్టుకున్నారా... దొంగలు ఎత్తుకెళ్లారా.... అయితే టెన్షన్ పడకండి. మీఫో